# జుక్కల్‌లో ఎస్బీఐ బ్యాంక్ - సొసైటీ కార్యాలయం మధ్య మొరం రోడ్డు ఏర్పాటు

జుక్కల్, బతుకమ్మ :జుక్కల్ మండల కేంద్రంలో ఎస్బీఐ బ్యాంక్ నుంచి సొసైటీ కార్యాలయం వరకు ఉన్న దెబ్బతిన్న రహదారిపై గ్రామ సర్పంచ్ సావిత్రి సాయి గౌడ్ ఆధ్వర్యంలో మొరం వేసి రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా సర్పంచ్ సావిత్రి సాయి గౌడ్ మాట్లాడుతూ, రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో రైతులు, ప్రజలు, బ్యాంకు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా సొసైటీ కార్యాలయానికి ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం వచ్చే రైతులు, అలాగే ఎస్బీఐ బ్యాంకుకు వెళ్లే ప్రజలకు ఈ మార్గం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మొరం రోడ్డు ఏర్పాటు అనంతరం రాకపోకలు సులభతరమయ్యాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఈ మార్గంలో ప్రయాణించడానికి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, ఇప్పుడు పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి తమ పాలకవర్గం కట్టుబడి ఉందని సర్పంచ్ తెలిపారు.

గ్రామంలో తాగునీటి సౌకర్యాల మెరుగుదల, రహదారుల అభివృద్ధి వంటి పలు పనులను చేపట్టినట్లు చెప్పారు.
గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్థానికుల అభిప్రాయం ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుండటంతో గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతోందని తెలిపారు. అలాగే

జుక్కల్ గ్రామంలో సర్పంచ్ సావిత్రి సాయి గౌడ్ నాయకత్వంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు.

# గన్నారంలో అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలో కంజర యాత్ర సందర్భంగా అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ విమలాకర్ రెడ్డి నేతృత్వంలో గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను పొందారు. శిబిరంలో వైద్య బృందం ప్రజలకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సలహాలు అందించింది. అలాగే ఆరోగ్య సంరక్షణ, వ్యాధుల నివారణ, జీవనశైలి మార్పులపై అవగాహన కల్పించింది. సాధారణంగా అధిక వ్యయంతో లభించే వైద్య సేవలను ఉచితంగా అందించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని

గన్నారం గ్రామ సర్పంచ్ సుజాత శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపసర్పంచ్, గ్రామ వీడీసీ సభ్యులు, వార్డు సభ్యులు, వార్డు సభ్యుడు మహేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని శిబిరం విజయవంతం కావడానికి సహకరించారు. గ్రామ స్థాయిలో నాణ్యమైన వైద్య

సేవలను అందించేందుకు ముందుకు వచ్చిన అపోలో ఆసుపత్రి వైద్య బృందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు.

# దివంగత సర్పంచ్ పావని కుటుంబానికి అండగా సర్పంచ్‌ల ఫోరం

## రూ.1.40 లక్షల ఆర్థిక సహాయం అందజేత

ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బెజ్జారపు పావని ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, మునిపల్లి గ్రామ సర్పంచ్ ముస్కు సాయిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు ఆదివారం ఆమె కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పావని కుటుంబానికి మొత్తం రూ.1.40 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జక్రాన్‌పల్లి మండల సర్పంచ్‌ల ఫోరం తరఫున రూ.80,000, దొంకేశ్వర్ మండల సర్పంచ్‌ల ఫోరం తరఫున రూ.50,000, అలాగే అంకాపూర్ గ్రామ సర్పంచ్ దేవేందర్ వ్యక్తిగతంగా రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని స్వర్గీయ బెజ్జారపు పావని కుమారులు భవితీ, భవిన్‌లకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముస్కు సాయిరెడ్డి మాట్లాడుతూ, తమతో కలిసి పనిచేసిన సర్పంచ్ బెజ్జారపు పావని అకాల మరణం బాధాకరమని, ఆమె కుటుంబానికి తోటి సర్పంచ్‌లుగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఇతర మండలాల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కూడా ముందుకు వచ్చి పావని కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా

సర్పంచ్‌ల ఫోరం కార్యవర్గ సభ్యులతోపాటు ఏర్గట్ల మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొడ భూమేష్, ఏర్గట్ల గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, బట్టాపూర్ సర్పంచ్ ప్రవీణ్ యాదవ్, తడపాకల్ సర్పంచ్ జింక స్వప్న అనిల్ కుమార్, నాగేంద్రనగర్ సర్పంచ్ సందే రంజిత్, గుమ్మిర్యాల సర్పంచ్ దేశబోయిన జమున సంజీవ్ యాదవ్, దోంచంద సర్పంచ్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి పెద్దపీట

## నిమ్స్ వైద్య చికిత్సకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ ఎల్వోసీ అందజేత

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నియోజకవర్గంలోని పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని, అవసరమైన వారికి నిమ్స్ లో ఎల్వోసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని కార్యాలయంలో ఆదివారం ఎల్వోసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఎల్ఓసి ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగరంలోని ఆటో నగర్ కు చెందిన మూడున్నరేళ్ల బాలిక ఉమ్మే కుర్సం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. దీంతో నిమ్స్ లో చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్వోసీ వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు.
. . . ఎయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు హైదరాబాదులోని బీపీ నగర్ ఎయిమ్స్ లో

అత్యాధునిక సేవలు అందుబాటు వచ్చాయన్నారు. పేదలు దీర్ఘకాలిక వైద్య సమస్యలు ఉన్నవారు, అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారు ఎయిమ్స్ కి వెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం వేయి కోట్లతో నిర్మించి, పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. 132 మంది ప్రొఫెసర్లు, 133 మంది సీనియర్ డాక్టర్లు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కావున నియోజకవర్గ ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియం చేసుకోవాలని కోరారు.

# కంజర్ గురుకులం ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిర్వహణపరమైన లోపాలు ఉన్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి రావడంతో మొపాల్ మండలం కంజర్ లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ విజయలలితకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలను క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు మండల స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.
ఇందులో భాగంగానే అధికారుల తనిఖీ సందర్భంగా కంజర్ గురుకుల విద్యాలయం నిర్వహణలో లోపాల గురించి కలెక్టర్ దృష్టికి రావడంతో జోనల్ అధికారిణి యగంధర్ లక్ష్మిచే ప్రాథమిక విచారణ జరిపించారు. జోనల్ అధికారిణి సమర్పించిన నివేదికలో నిర్వహణ పరమైన లోపాలు ఉన్నట్లు వెల్లడి కావడంతో గురుకులం ప్రిన్సిపాల్ విజయ లలితకు కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల నిర్వహణలో నిర్లక్ష్య వైఖరిని ఉపేక్షించబోమని, అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం

## నసురుల్లాబాద్ రహదారిపై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

బాన్సువాడ, బతుకమ్మ :సీఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని నసురుల్లాబాద్ జాతీయ రహదారిపై ధర్నా రాస్తారో నిరసనచారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బాన్సువాడ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ మాట్లాడుతూ... నిన్న సీఎం రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీపై చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండనీయమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుండి నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీళ్లు తీసుకురాలేదని ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్, కేటీఆర్ , హరీష్ రావు ను తప్పుగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ రాష్ట్ర ప్రజలే వారికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర ఉన్నాయని హెచ్చరించారు.

# ఘనంగా కట్ట మైసమ్మ పండుగ

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని తీర్మాన్ పల్లి గ్రామంలో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా కట్ట మైసమ్మ పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కులాలకు చెందిన కుల పెద్దల సమక్షంలో కట్ట మైసమ్మకు బోనాలు సమర్పించుకున్నారు. అనంతరం కట్ట మైసమ్మ గుడి వద్ద గ్రామంలోని అన్ని కులాల చెందిన వ్యక్తులు మహాబలిదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం పంటలు సమృద్ధిగా పండి గ్రామం గా ఉండాలని కోరుతూ కట్టమైసమ్మను వేడుకుంటామని ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్ తెలిపారు. ఆమె ఆశీర్వాదంతో ప్రతి ఏడు పంటలు సమృద్ధిగా పండి రైతులు షష్యశ్యామలంగా ఎంతో ఆనందంగా ఉంటారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు వైస్ చైర్మన్ జరుగు రాజు, ఇమ్మడి సాయిలు, గాండ్ల ప్రదీప్, కుమ్మరి భాస్కర్, చన్న తిరుపతి, శెట్టి గంగారం, కురుమ బయన్న, బొడ్డు రాజన్న, తెడ్డు అబ్బయ్య, ఉప సర్పంచ్ జరుగు రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్, బాల్కొండ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి భుజంగరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లందరూ తమకు అందజేసిన ఓటరు ధృవీకరణ ఫారాలను పూర్తిగా నింపి, వీలైనంత త్వరగా సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ లు) కు అందజేయాలని సూచించారు. ఏర్గట్ల మండలంలో ఇప్పటివరకు సుమారు 75 శాతం ఓటరు ఫారాలను బీఎల్ఓ లు సేకరించగా, అందిన ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. ఇంకా మిగిలిన 25 శాతం మంది ఓటర్లు వచ్చే రెండు నుంచి మూడు రోజుల్లోగా తమ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓ లకు ఫారాలను తప్పనిసరిగా అందజేసి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏర్గట్ల మండల తహసీల్దార్ జె. మల్లయ్య, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ లు), పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.